

**ఆయన అట్ల కూర్చొని దిగులుగానో, ఉద్వేగంతోనో మాట్లాడుతోంటే దుర్గమ్మకు మనవరాలు తప్పక వస్తదనే ఆశ ఉండేది. పైకి కనిపించడుగాని, లోన ఎంత బాధ ఉన్నదో... అనుకునేది. కానీ ఆ మాటలు మనసులో స్థిరంగా ఉండేవి కావు. ఏమైతదో ఏమో అనే ఆందోళన వెంటాడేది.**

పద్మకుమారి

# అపురూప

1





ఇంటికి వచ్చిన వాళ్లంతా వెళ్లిపోయారు. ఇప్పుడు ఇద్దరే మిగిలారు. ఆ హడావిడితోపాటు సంతోషం కూడా మాయమైపోయింది. మెల్లగా బైట కూడా ఒంటరితనం ఆక్రమిస్తున్నది. ఏదో దిగులు. ఇంటి ముందున్న ఖాళీస్థలంలో కుర్చీ వేసుకొని కూర్చున్నాడు. చేతిలో దిన పత్రిక పేజీలు తిరుగుతున్నాయిగానీ నారాయణ మనసు దానిమీద లేదు. బైటి గేటుకు ముఖద్వారానికి మధ్య ఉన్న స్థలంలో అటూ ఇటూ నాటిన రెండు కొబ్బరిచెట్లు, కుడిపక్క మందారం చెట్లు కొద్దిగా ఎదిగి ఉన్నాయి. ఇల్లు మొదలు పెట్టినప్పుడు వాటిని నాటారు. మిగతా జాగా అంతా ఖాళీగానే ఉంది. రెండు మూడు రోజులుగా అక్కడ మనుషులు తొక్కిన అడుగుల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇంట్లోంచి కొత్త రంగుల వాసన ఇంకా ఘాటుగా ముక్కుపుటాలకు తాకుతూనే ఉంది.

అనుకున్న దానికంటే ఇంటికి రెండు మూడు లక్షలు ఎక్కువే ఖర్చు వచ్చింది. ముందే జాగ్రత్త పడితే ఇంత అయ్యేది కాదేమో. ఇప్పుడు అనుకొని ఏం లాభం? ఇల్లు కట్టడం అంటే మాటలా, నలుగురు మనుషులు తలా ఒక పని అందుకోవాలి. కొడుకు ఉండి ఉంటే అన్నీ చూసుకునేవాడు. అప్పటికీ బిల్డర్‌కు ఇచ్చాడు.

కొడుకు లేని వెలితి బాధిస్తూనే ఉంది.

పిల్లాపాపలతో వచ్చే వాళ్లను చూసి కొడుకు కోడలు కూడా బతికి ఉంటే నా ఇల్లు ఎప్పుడూ నిండుగా ఉండేది అని దుర్గమ్మ లోపల వలపోసుకుంటుంది. కొత్తింట్లకు పోవాలన్నప్పటి నుంచి దుర్గమ్మ భర్తను గమనిస్తూనే ఉంది. ఎవరెవరినో పిలిచాడు. ఇండ్లకు పోయి మరీ పిలిచాడు. ఇట్లా ఎవరినీ ఇంటికి పిలిచే సందర్భమే రాలేదు. కొడుకు పెళ్లికి అందరినీ పిలవాలనుకున్నాడు. అవేవీ తమ చేతిలో లేకుండా జరిగిపోయాయి. ఇప్పుడు ఇంట్లోకి పోతున్నాం రాండని పిలవాల్సి వచ్చింది. సరిగ్గా ఆ సమయంలో భార్య అన్న మాట అంతరార్థం స్ఫురించింది. ఇంతకూ ఈ ఇల్లు ఎవరికి ఇచ్చిపోవాలి? అని నలుగురు అనుకోరు...? అందుకే చిన్న పూజ కానిచ్చి ఇంట్లోకి వెళ్దామంది.

కొడుకు కోడలు శవాలు ఇంటికి వచ్చినప్పటి సంగతులు నారాయణకు గుర్తుకు వచ్చాయి. అంత్యక్రియలయ్యాక ఎవరో అన్నారు. మనవరాలు వచ్చి తల్లిదండ్రుల శవాలను చూసి వెళ్లిందని. ఎవరి దగ్గర ఉంచారో, తల్లిదండ్రులు చని పోయిన దు:ఖంలో కూడా అంత నిగ్రహంగా ఎలా ఉండగలిగింది. నానమ్మ, తాతయ్యలను ఒక్క మాటైనా పలకరించకుండా ఎందుకు వెళ్లిపోయిందో? మనవరాలు అప్పుడు వచ్చి వెళ్లినందుకు కొంచెం సంతోషం కలిగినా అంత రహస్యంగా చూసి వెళ్లినందుకు బాధగా ఉండేది.

పిల్ల ఎట్ల ఉన్నదో? చూడలేకపోయినందుకు మధనపడ్డారు.

రవీందర్ దూరం చుట్టం. కొడుకుతో కలిసి చదువుకున్నాడు, సుధాకరంటే ప్రాణం. చనిపోయిన రోజు అంతా ముందుండి చేసిండు, గవర్నమెంట్ ఉద్యోగం... ఇట్ల బైటపడితే కష్టం... అని ఎవరో అన్నరట. కానీ వెనుకముందాడలే, సుధాకరంటే అంత ప్రేమ. 'చిన్నమ్మా వాడట్లపోతే నేను లేనా ఏంది? బాగ దూరమైపోయిందిగాని లేకపోతే మీ ఇంటి పక్కనే ఇల్లు తీసుకొని ఉందు... మా అమ్మ... నువ్వు వేరువేరా చెప్పు,' అనేవాడు.

నారాయణ ఇల్లు కడుతున్నడని తెలిసి ఎన్నిసార్లు వచ్చిపోయాడో, వాళ్లతో వీళ్లతో మాట్లాడి పనులు తొందరగా కావాలని పురమాయించేవాడు. గృహప్రవేశానికి ముందురోజే వచ్చాడు. అందరూ వెళ్లిపోయినా ఉండిపోయాడు.

సాయంత్రం చిన్న కునుకు తీస్తుంటే దుర్గమ్మ గదిలోకి వచ్చి, "రవీందరూ చాయ్ తాగుతవా?" అని లేపింది.

లేచి ముఖం కడుక్కొని వచ్చి, "చిన్నాన్న ఉన్నడా?" అని అడిగాడు.

"హాల్లో కూసున్నడు."

"అందరు పోయిండ్రు కదా..." అంటునే ముందు గదిలోకి నారాయణ దగ్గరికి వచ్చి కూర్చున్నాడు.

"చిన్నమ్మ, నువ్వు కూడా రారాదు..." అన్నాడు చాయ్ తాగుతూ. ఆమె వచ్చింది.

"సుధాకర్ కూతురు ఎవరి కాడున్నది తెలిసింది. బాగ చదువుకుందంట..." వాళ్లిద్దరు ఏమంటారో అని ఆగాడు. వాళ్ల కళ్లలోకి చూశాడు.

కొడుకు పేరు వినబడగానే దుర్గమ్మ కళ్లలో కాంతి కనిపించింది.

"ఎక్కడున్నదో చెప్పరాదు. మీ చిన్నాన్న, నేను పోయి తీసుకొచ్చుకుంటం," అన్నది ఆనందంగా,

నారాయణ ఏమీ అనలేదు కాని ఆయన అంతరంగం కూడా అదే అని ముఖకవళికలే చెప్పాయి.

ఆయన పలకకపోయేసరికి భర్తనే చూస్తుండిపోయింది దుర్గమ్మ. ఏదో అన బోతున్నట్లు కనిపించాడు. రవీందర్ కూడా ఇంకేం మాట్లాడకుండా ఉండిపోయాడు.

"నా మనవరాలని తెలువద్దనే కదా వేరే వాళ్ల కాడ ఉంచింది. ఏ ఇబ్బందులు లేకుంటే తనే వచ్చేది కదా... మనోల్లను కాదని... ఇప్పుడు అక్కడికి పోవడం..." మాట పూర్తి చేయలేకపోయాడు.

మనోల్లు... అని నోటి వెంట అప్రయత్నంగా వచ్చింది. దానితోపాటే ఎందరో గుర్తుకొచ్చారు. కొడుకు సుధాకర్ కళ్ల ముందుకు వచ్చి నిలబడ్డట్లే అయింది. కోడల్ని ఒక్కసారే చూసింది. ఎవరు కన్నరోగాని ఎంత మంచిపిల్ల. కొడుకు కోడలుకు తలకొరివి పెట్టడం కన్నా ఈ భూమి మీద దురదృష్టం ఎవరికైనా ఏం ఉంటుంది? ఆ ఇంత తలకొరివి పెట్టుకోనీకి అయినా, కొడుకు కోడలు శవాలుగా ఇంటికి వచ్చారు. ఒక్క రోజు అయినా ఇంటి ముందు ఉంచుకొనుడే భాగ్యమనుకున్నాడు. అదే వాళ్లిద్దరు బతికి ఉండంగా వచ్చింటే ఇల్లు ఎంత కళకళలాడేది అనుకునేసరికి గుండెల్లో నొప్పిగా అనిపించింది. అబ్బా... అని బైటికే మూలిగిండు.

తల్లిదండ్రులకు బిడ్డలు తలకొరివి పెడితే... ఎంత బాధ ఉన్నా అది బాధ్యత అనిపిస్తది.

కానీ తన నుదుటిన ఇట్ల రాసి ఉంది. ఆ కొద్దిక్షణాల్లోనే నారాయణ చాలా నీరసపడిపోయాడు.

"అయితే మనోల్లకు చెప్పే తెచ్చుకుందాం... వద్దంటరా ఏంది? ఉన్న కొడుకు ఒక్కడు అట్ల పోతే ముసలోల్లం ఏం జూసుకోని బతకాలి? నేను అడుగుతా... కొడుకు కోడలుంటే వాల్లకేమయితదో అని భయపడాలిగాని," అంది దుర్గమ్మ.

"నిజమే... మీరు పోవాలనుకుంటే మా ఊరికి రాండి. నేను ఏర్పాటుజేస్తా. మల్లా ఫోన్ చేసుడు ఒద్దు," అన్నాడు రవీందర్,

ఆ రాత్రి రవీందర్ వెళ్లిపోయాడు. కానీ నారాయణ మనవరాలి ధ్యాసలోనే గడుపుతున్నాడు. మధ్య మధ్యలో దుర్గమ్మ ఏదో ఒక వంక చూసుకొని తన మాట చెప్తూనే ఉంది.

రవీందర్ పోతూ పోతూ, "ఇప్పుడు అంతా మారిపోయింది చిన్నమ్మ. అప్పటి లెక్క లేదులే, శానా జరిగినై. చిన్నప్పుడు ఆ పిల్లను మీ దగ్గర ఉంచితే ఎవరీ అమ్మాయి? సుధాకర్ కూతురేనా? పాపను చూసుకోడానికి వస్తుంటడా? అని పోలీసులు అడుగుతరు కదా? అందుకని వేరే వాళ్ల కాడ ఉంచింటరు. అప్పుడంటే తప్పలేదు. ఇప్పుడు అమ్మానాన్న ఇద్దరు లేరుకదా? ఇంకేమైతది చెప్పు? తెచ్చుకుంటే..." అన్నాడు.

దీంతో దుర్గమ్మ వాదన మరీ బలపడింది.

ఆ మాట ఎన్నిరకాలుగా వీలైతే అన్ని రకాలుగా చెప్పింది. అయినా నారాయణ ఇంకా చాలా ఆలోచిస్తున్నాడు. ఎట్లయినా సరే మొగుడ్ని ఒప్పించాలని, "నా నెత్తురు పంచుకోని పుట్టింది. దానిమీద నాకు కాకపోతే ఇంకెవరికి హక్కు ఉంటది?" అని కూడా అన్నది.

"ఇన్నేండ్ల తర్వాత ఇప్పుడు హక్కుల గురించి ఎందుకు? నిజానికి ఇది ఎంత విషాదం... మొహం తెలవని మనవరాలి మీద హక్కులదాకా వెళ్లడం...? అవతల ఇన్నేండ్లు పెంచినోల్లకు హక్కులు ఉండవా?" అన్నాడు నారాయణ.

నారాయణ ఆలోచనల్లో పడ్డాడు. అంతగా భార్య మాటలు పనిచేశాయి. మనవరాలి గురించి ఎంతగా ఆలోచిస్తున్నాడోగాని కంటి మీద కునుకు పట్టడం లేదు. పట్టినప్పుడల్లా చిన్ననాటి సుధాకరే కలలోకి వస్తున్నాడు. కొడుకు ఆటలు, అల్లరి కలలో తనివి తీరా చూసుకుంటున్నాడు. తీయని జ్ఞాపకాల్ని చెరిపేసే చేదు నిజాన్ని దూరం చేసే ప్రయత్నంలో నారాయణ చాలా అలిసిపోయాడు. ఊపిరి ఆడక బయట ఊయల మంచంలో వచ్చి కూర్చున్నాడు.

దుర్గమ్మ చాయి తీసుకొని వచ్చింది. విచారం తప్ప నారాయణ ముఖంలో మరేమీ కనిపించడం లేదు. దాంతో, "ఏందట్ల ఉన్నవ్... రాత్రంతా నిద్రపోలేదా ఏంది?...' అని కప్పు చేతికి ఇచ్చి పక్కనే కూర్చొని మొగుడి ముఖంలోకి చూసింది. బాగా నీరసంగా కనిపించాడు. ఇంటి పనంతా ఒక్కడే చేయాల్సి వచ్చినప్పుడు కూడా అంత అలిసిపోలేదు.

"ఇప్పుడు అప్పటి లెక్క లేదంట గదా, నిన్న రవీందర్ చెప్పిండు. మనవరాల్ని తెచ్చుకున్నా ఏంగాదని," తన దృఢ నిశ్చయం అదే అన్నట్లు చెప్పింది.

"తెచ్చుకుందామనుకుంటే తెచ్చుకోవాలి... ఏమైనాగాని అని. అప్పటి లెక్క లేదులే... ఏం కాదులే... అనుకోడానికి లేదు. ఇన్ని చూస్తూ అట్ల ఎట్లనుకుంటము. ఏ కాలానికి తగినట్లు ఆ కాలానికి ఉంటది. అప్పటి జమానే ఇప్పుడూ నడుస్తుంది.. ఏదీ పోలేదు. కొత్తగా వచ్చేవి వచ్చినయి. మల్లకసారి వచ్చి ఈ పిల్ల ఎవరు? ఇన్ని రోజులు ఎక్కడుండే... ఇప్పుడు ఎవరు పంపించిండ్రు... అని అడుగుతరు. అంతా మళ్లీ మొదటికి వచ్చేదే, మనమనుకున్నట్లు ఉండదు. తట్టుకుంటమా? అనే భయం..." నారాయణ ఈ మాట గొంతు తగ్గించి చెప్పాడు.

ఒక క్షణంలో దుర్గమ్మకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి. ఆ రోజుల్లో పోలీసులు ఎప్పుడొచ్చిపడతరో అనే భయంతోనే రాత్రి పగలు గడిచేది. తలుపులు పగలకొట్టుకొని పోలీసులు లోపలికి వచ్చేవాళ్లు. అర్ధరాత్రి వచ్చి భర్తను ఎన్నిసార్లు స్టేషన్‌కు తీసక పోయారో, డ్యూటీ అయ్యాక బాయి మీది నుంచి వస్తుంటే అటు నుంచి అటే తీసుక పోయేవాళ్లు, గంట ఆలస్యమైతే ఏమైందో అని భయపడేది. అప్పుడే మన్న ఫోన్లా? ఇంటికి వచ్చి మనిషి కనిపించే దాకా ప్రాణం కొట్టుకునేది.

"సుధాకరూ ఏందిరా ఇది... మాకెందుకు ఈ కష్టాలు," అని ఏడ్చేది.

మళ్లీ చిట్టీ పంపిస్తే చెప్పిన పని చెప్పినట్లు చేసేవాడు. అంత ధైర్యం ఎట్ల వచ్చేదో.

"మల్ల ఏంది ఇది. అసలే వాడి కోసం హింస పెడతాంటె..." అనేది.

"ప్రాణం ఉంటదో పోతదో పట్టించుకోకుండా వాడు అక్కడ ఉన్నడు. ఇక్కడ మనకు ఏమయ్యేది తెలుస్తునే ఉన్నది వాడికి. వాడు చెప్పిన పని చేయకుంటే ఎట్ల? ఎంత అవసరమో మరి," అనేవాడు.

❖

మంచిర్యాలకు పడమటి దిక్కు కాలనీ అది. ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. సిమెంట్ రోడ్లు వచ్చాయి. సింగరేణిలో పనిచేసే వాళ్లలో చాలామంది అప్పట్లో అక్కడ ఇండ్ల స్థలాలు కొనుక్కున్నారు. ఒక్కొక్కరే ఇండ్లు కట్టుకుంటున్నారు. వాళ్లలో చాలా మంది ఇట్ల సొంత ఇల్లు కట్టుకుంటామని కలలో కూడా గతంలో అనుకోలేదు. నారాయణ కూడా రిటైర్ అయ్యాక కాలనీ క్వార్టర్ ఖాళీ చేసి అద్దె ఇంట్లోకి పోవాల్సిందే అనుకున్నాడు. ఇంక ఆర్నెల్లలో రిటైర్ కాబోతాననగా ఇల్లు మొదలుపెట్టాడు. మంచి ఏరియా... జిల్లా కేంద్రం అయ్యాక ధరలు పెరిగాయి. ఇల్లు కట్టుకుంటే బాగుంటుంది... అని చాలామంది అన్నారు. రెండు నెలలపాటు ముందు వెనకల ఆలోచించి నారాయణ పనిలోకి దిగాడు.

'నీకు ఇల్లు మీద రంది ఎక్కువైందే. చేతిలో ఉన్నవీ, రిటైర్ అయితే వచ్చేవీ ఖర్చు పెడితేగాని తీరేటట్లు లేదు...' అనికూడా అనేది. మళ్లీ ఒకసారి పోన్లే ఈ జన్మకు ఏం చూసుకొని జూసి మురిసిపోయేది ఉంది? ఒక ఏడాదిపాటు ఇల్లు కట్టుడు అని తిరుగుతడు. ఆ తర్వాత రెండు మూడేళ్లయినా కొత్త ఇల్లు మోజు ఉంటది... అటు ఇటు తిరుగుతూ గడుపుతడు. ఆ ఇంత రిటైర్ అయితే ఇంగేముంటది? అనుకునేది.

ఇప్పటికే నారాయణకు డ్యూటీకి పోవడం తప్ప ఇంకో పనే లేదు. ఇంతకు ముందులాగా బైట తిరగడం లేదు. లేకపోతే వేజుబోర్డు పెరగాలని, మస్టర్ల కోతకు వ్యతిరేకంగా బందులనీ, ఇంకా ఏవో యూనియను పంచాయితిలని ఇంట్లో ఉండేదే లేదు. మెల్లగా అన్ని తగ్గిపోయాయి.

దోస్తులు ఇంటికి రావడం కూడా లేదు. కొడుకు కోడలు చనిపోయాక మనిషి సగం అయ్యాడు. ఎట్లబడితే అట్ల తిని తిరిగే మనిషికి ఇప్పుడు టైంకి తినడం, తినే టైం ఎప్పుడైతుందా? అని ఎదురుచూడ్డం అలవాటైంది. కూర్చున్నా, లేచినా శుభ్రంగా ఉందా లేదా అని తరచి చూసుకోవడం, తినేది పడుతుందా? లేదా లెక్కవేసుకోవడం దినచర్య అయింది. ఆయనకు తగినట్లు అన్నీ అమర్చడం తప్ప దుర్గమ్మకు ఇంకో

పని లేకుండాపోయింది.

ఇల్లు మొదలుపెట్టాక, "మనవరాలు వస్తే ఇల్లుండాలి కదా!" అనేవాడు భార్యతో. అప్పుడామె బొటబొట కన్నీరు కార్చేది.

"ఇల్లేమోగాని, మనవరాల్ని తీసుకురారాదయ్యా. అది వస్తే ఈ ఇల్లే నీకు ఇంద్రభవనం అయితది," అనేది. ఆ మాటలు నారాయణకు ఆనందంగా ఉండేవి. కొడుకు లేడనే దిగులు ఎగిరిపోయేది.

"తెచ్చుకుంటమా లేదా? అని కాదు... మన రక్తం పంచుకొని పుట్టిన పిల్ల కదా? ఎప్పటికైనా వస్తుందేమో. నా వారసత్వం అదే. సుదాకరుకు కూడా ఏమివ్వలేదు. నాకిది కావాలని అడిగి తీసుకోలేదు. అర్థాంతరంగ ముగిసిపోయె," అనేవాడు.

ఆయన అట్ల కూర్చొని దిగులుగానో, ఉద్వేగంతోనో మాట్లాడుతోంటే దుర్గమ్మకు మనవరాలు తప్పక వస్తదనే ఆశ ఉండేది. పైకి కనిపించడుగాని, లోన ఎంత బాధ ఉన్నదో... అనుకునేది. కానీ ఆ మాటలు మనసులో స్థిరంగా ఉండేవి కావు. ఏమైతదో ఏమో అనే ఆందోళన వెంటాడేది. రెండు రోజులు బాగున్నట్లుంటే మళ్లీ ఏదో ఒకటి జరిగేది. కొన్ని రోజులు ఓపెన్ కాస్టు వద్దని గొడవలయ్యాయి. వీటి వెనుక ఎవరున్నారో తెలుసా? అని కార్మికులు అనుకోవడం నారాయణ స్వయంగా విన్నాడు. నిజమేనేమో. ఆయనతో ఎవ్వరూ ఏదీ అనరు. అన్నీ ఆయనకు తెలుసు అని కావచ్చు. ఆయనతో మాట్లాడితే ఏమన్నా అవుతుందేమో అనే భయం కావచ్చు. వాళ్ల భయం ఏమోగాని నారాయణకే మళ్లా ఎట్లాంటి రోజులు వస్తాయో అనే ఆందోళన ఉండేది. ఆమెకు కూడా అట్లాగే ఉండేది. అందుకే మనవరాలి ఆలోచనలే కాని, ఒక్కడుగు ముందుకు కదిలేవాళ్లు కాదు.

అది అట్ల ఉండగానే ఇల్లు మొదలుపెట్టాడు.

"డబ్బు ఉంటే దేనికో ఒక దానికి ఖర్చయితయి. అదే ఇల్లు కట్టినమనుకో సుధాకర్ కూతురు మా తాతయ్య నాకేమియ్యలేదని అనడానికి ఉండదు," అన్నాడు తన నిర్ణయానికి సమర్థనగా.

ఆ మాటకు ఆమె, "రిటైర్ అయితే ముందు క్వార్టర్ ఖాళీ చేసి కిరాయి ఇంట్లోకి వెళ్లే పని మనకు తప్పుతుంది. నీ మనసు చెప్పినట్లు నువ్వు విని మనమరాల్ని తీసుకోని వచ్చినవనుకో... అంతకంటే ఏం కావాలి?" అన్నది.

ఇప్పుడామెకు అవన్నీ గుర్తుకు వస్తున్నాయి.

ఎన్నో ఏండ్ల కింద కొడుకును, కోడల్ని చూడ్డానికి వెళ్లినప్పటి జ్ఞాపకాలు చుట్టు ముట్టాయి. కొడుకు ఎట్లున్నడో, చూడక ఎన్నేండ్లాయె, పెండ్లి చేసుకున్నడంట. వాని పెండ్లి గురించి ఎన్ని అనుకున్నది. ఒక్కటీ కాలే, కోడలు ఎట్ల మాట్లాడుతదో... అనుకుంటూ వెళ్లింది.

బయల్దేరేటప్పుడే అడిగింది... 'మనల్ని ఎన్ని రోజులు ఉండనిస్తరు,'' అని.

''ఏం ఉండమంటే అక్కడే ఉంటవా? ఏంది?'' అన్నాడు నారాయణ.

''కొడుకు దగ్గర తల్లిని ఉండొద్దంటదా పార్టీ, నాకు తెలిసినోల్లు లేరా, అడుగుతా...'' అన్నది దుర్గమ్మ.

''ఎట్ల పోయి రావాల్నో, అసలే బాగలేదు... అని రంధి పడుతుంటే ఎన్ని రోజులు ఉండనిస్తరు అని అడుగుతమా. అట్ల చూసి ఇట్ల రావాల్సి వస్తుందో ఏమో...'' అన్నాడు నారాయణ,

''అదేందయ్యా.. నాలుగు రోజులన్నా ఉండనియ్యరా? కోడలుతో తనివితీర మాట్లాడాలి,'' అన్నది విచారంగా. అన్నట్లే రాత్రికి చేరుకొని మర్నాడు మధ్యాన్నం తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది.

రాత్రి చీకట్లో కొడుకు మొహం పోల్చుకోవడం ఎంత కష్టమైంది. అందరూ ఒకే తీరుగా ఉన్నరు. గొంతు, మాటను బట్టి కనుక్కోవాల్సి వచ్చింది. కోడలు ఎట్ల ఉంటదో చూడ్డానికి తెల్లారేదాకా ఎదురుచూడాల్సి వచ్చింది. ఆలివ్ గ్రీన్ డ్రస్‌లో, క్రాఫ్‌తో, భుజానికి తుపాకి తగిలించుకొని ఉన్న కోడల్ని చూసి ఆశ్చర్యపోయింది. అక్కడున్న ఆడవాళ్లందరూ అలాగే ఉన్నారు. కోడలితో మాట్లాడటం మొదట కొంచెం బెరుకనిపించింది. అంతా కొంచెంసేపే. మంచిపిల్లే అనిపించింది దుర్గమ్మకు. అమ్మా అమ్మా... అంటూ కూతురులా మాట్లాడుతోంటే టైమే తెలియలేదు. దీంతో కోడలు మరింత బాగా నచ్చింది.

నాలుగు గంటలప్పుడు, ''అమ్మా ఇంక బయల్దేరుతరా?'' అని కొడుకు అన్నడు.

మామూలుగా అయితే, 'అప్పుడేనా?' అనేదేమో. లోపలికి అడుగుపెడు తున్నప్పుడు నారాయణ, ''మనకు ఎన్ని రోజులైనా ఉండాలని ఉండొచ్చు. కానీ ఉంచుకోడానికి వాళ్లకు చాలా ఇబ్బందులు ఉంటాయి. అదో యుద్ధరంగం...'' అన్నాడు. దాంతో దుర్గమ్మ మౌనంగా తల నేలకేసింది. అప్పుడే పోడానికి ఇష్టంలేదని అందులో తెలుస్తూనే ఉంది. అయినా కొడుకు కోడలు తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు.

ఇద్దరూ కొద్ది దూరం తోడు నడిచారు. ఇక ఉంటామని నిలబడ్డారు. అప్పుడు, ''సుదాకరూ నాకేం చెబుతవురా?'' అన్నది దుర్గమ్మ,

ఆ మాటకు ఇద్దరికీ కండ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె వలవల ఏడ్చేసింది. నారాయణకు కూడా మనసంతా చేదుగా ఉంది.

కొడుకు, కోడలును తనవితీరా చూసుకున్న క్షణాలవి. ఇప్పుడు మనవరాలి కోసం ఆరాటం ఒక్కటే మిగిలిపోయింది.

❖

నాలుగు రోజులయ్యాక పొద్దున పది గంటలప్పుడు ఇంటి ముందు ఓ కారు వచ్చి ఆగింది. దారిన పోతున్న వాళ్లను అడిగి కారు సైడ్‌కు తీసుకున్నారు. చెట్ల మధ్య ఉన్న చెత్తా చెదారం తీసి శుభ్రం చేస్తున్న దుర్గమ్మ తలెత్తి చూసింది. ఇరవై ఐదేళ్ల అమ్మాయి ముందు డోర్ తీసుకొని బైటికి వచ్చింది. వెనక డోర్ తీసి లోపలి నుంచి ఓ పండు వృద్ధుడిని బైటికి దించింది. అప్పుడు కారు డ్రైవర్ ఆసరాగా వచ్చాడు. ఆ తర్వాత మరో ముసలామెను కూడా దించారు. వాళ్లను చూసి ఎవరబ్బా అనుకుంటూ దుర్గమ్మ గేటు దగ్గరికి నడిచింది.

ఆ అమ్మాయి చున్నీ సవరించుకుంటూ గేటు దగ్గరికి వచ్చి, ''మీరు దుర్గమ్మ కదూ. మీ ఇంటికే వచ్చాం...'' అన్నది.

దానికి దుర్గమ్మ ఏమీ అనుకముందే నాగేష్... అని డ్రైవర్‌ను పిలిచింది. అతను ఆ ముసలాయన చేయి పట్టుకొని గేటు దగ్గరికి నడిపించుకొచ్చాడు. ఆ అమ్మాయి వెళ్లి ముసలామెను అతి జాగ్రత్తగా కారులోంచి దించి లోపలికి దారితీసింది. ఆయన కంటే ఆమె మరీ మెత్తబడ్డట్లు ఉన్నది. ఆ పిల్లను దగ్గరిగా చూస్తే ఏదో బాగా తెలిసిన ముఖంలాగానే ఉంది.

దుర్గమ్మ వాళ్లకంటే ముందు లోపలికి వెళ్లింది. ఏంచేయాలో తోచలేదు. నారాయణ పొద్దున్నే బైటికి వెళ్లాడు. ఇంకా రాలేదే... అని కిటికీలోంచి రోడ్డు మీదికి చూసింది. ఆ తర్వాత కుర్చీలను అట్లట్ల దులిపి వాళ్లను కూర్చోమన్నట్లు చూసింది. ముసలాళ్లిద్దరూ కూర్చున్నారు.

''నేను పోవాలా మేడం...'' అని కారు డ్రైవర్ ఆ అమ్మాయితో అన్నాడు. తను బైటికి వెళ్లి పైసలు తీసి ఇచ్చి పంపించింది.

లోనికి వస్తుండగా ఆ ముసలాయన, ''అమ్మా... అపురూపా... అతను వెళ్లిపోయాడా?'' అని పిలిచాడు.

వీళ్లకు మంచినీళ్లు ఇద్దామని లోపలికి పోబోతున్న దుర్గమ్మ ఆ మాట విని ఆగిపోయింది. వెనక్కి తిరిగి ఆ పిల్ల ముఖంలోకి చూస్తూ అపురూపా... అని మనసులో అనుకున్నట్లు బయటికే అనేసింది. దాంతో ఆ ముగ్గురూ దుర్గమ్మ వైపు చూశారు.

కొడుకు ఎప్పుడో ఉత్తరంలో రాశాడు... 'అమ్మా... నీ మనవరాలికి అపురూప అని పేరు పెట్టాం. అంతే అపురూపంగా ఉంటుంది,' అని. ఆ పిల్ల ముఖకవళికలు పరిశీలనగా చూస్తూ దుర్గమ్మ ఉద్వేగానికి గురైంది. ఆవైపు రెండడుగులు వేసింది.

''నీ పేరు అపురూపనా...'' అని అడిగింది. ఆ మాట లోలోపలి నుంచి తనకే వినిపించనట్లు వచ్చింది.

''అవును నానమ్మా... నేను మీ అపురూపనే...'' అని దుర్గమ్మ చుట్టూ చేతులు వేసింది.

ఆమె అయోమయానికి గురైంది. గందరగోళపడింది. నిజమేనా? ఈ పిల్ల ఏమంటోంది? ఇంకా సందేహం నుంచి బయటికి రాలేదు.

"నేను మీ సుధాకర్ కూతుర్ని," అన్నది అపురూప,

ఆ మాటలు దుర్గమ్మకు మదిలోకి ఇంకగనే, ఎప్పటినుంచో గడ్డకట్టి ఉన్న దుఃఖమంతా కరిగి ఒక్కసారిగా ఏడుపు అందుకుంది. అలా ఏడుస్తూ అపురూపను గుండెలకు అదుముకున్నది. ఏడ్చి ఏడ్చి కిందికి జారిపోయింది. ఎదుట కూచున్న ముసలామె ఊకోమ్మా... ఊకోమ్మా... అని దుర్గమ్మను సముదాయించబోయింది.

ఆ సమయంలోనే నారాయణ లోపలికి వచ్చాడు.

ఈ కొత్త మనుషుల్ని, ఏడుస్తున్న భార్యను చూసి కంగారుపడిపోయాడు. ఎవరికన్నా ఏదన్నా జరిగిందేమో అనుకున్నాడు. ఆయననట్లా చూస్తూనే దుర్గమ్మ, "ఈ పిల్ల నీ మనమరాలు. సుదాకరు కూతురంట..." అని ఆనందం, దుఃఖమూ కలగలసిన గొంతుతో అన్నది.

ఆమె లేవబోతోంటే అపురూప రెండు చేతులు ఆసరా ఇచ్చి నిలబెట్టింది.

ఏం మాట్లాడాలో తెలియక నారాయణ తడబడిపోయాడు. అయినా అపురూప వంక రెండడుగులు వేశాడు. ఆమె దుర్గమ్మను కుర్చీలో కూచోబెడుతూ నారాయణ దగ్గరికి వెళ్లి, "తాతయ్యా..." అన్నది. అతను ఆ ముఖంలోకి చూశాడు. నిజమే.. సుధాకర్ పోలికలు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాయి. చామనచాయ రంగులో చురుకైన ఆ కళ్లలో కొడుకే కనిపించాడు.

"మేమింక నీ దగ్గరికి రాలేమని నీవే వచ్చావా తల్లీ?" అని అపురూపను దగ్గరికి తీసుకున్నాడు. ఆ మాట అంటున్నప్పుడు ఆయన గొంతు పూడుకపోయింది. ఇంకేం మాట్లాడలేకపోయాడు. ఇన్నేళ్లు దూరంగా ఉన్న అపరాధ భావం కూడా తొంగి చూసింది. కుర్చీలో కూలబడిపోయాడు.

"నా జన్మ ఎట్లాంటిదో.. కొడుకును, కోడలు పోగొట్టుకున్న. మనమరాలు ఉన్నదని తెలిసి కూడా ఇన్నేళ్లు చూడలేకపోయాను," అన్నది దుర్గమ్మ,

నారాయణ పక్కనున్న కుర్చీ దగ్గరికి లాగి మనమరాల్ని కూచోమన్నట్లు చూశాడు. అపురూప చేతులు పట్టుకున్నాడు. ఆ స్పర్శకు గుండె కరిగిపోయింది. సుధాకర్‌ను ముట్టుకున్నట్లే ఉంది.

"తల్లీ ప్రాణమంతా నీమీదే పెట్టుకొని బతికినమని చెబితే నువ్వు నమ్మవు. దేనికంటే మేం నిన్ను పట్టించుకోలేదు కాబట్టి. ఇప్పుడు నువ్వే వచ్చావు. నేనింకా నమ్మలేకపోతున్నాను, కలగంటున్నట్లే ఉంది..." అన్నాడు.

వాతావరణం మార్చడం కోసం అపురూప నవ్వుతూ... "కల కాదు తాతయ్యా... నిజమే. నానమ్మా నీకు కూడా కలగానే ఉందా," అన్నది.

''నా బంగారానివి.. కళ్ల ముందు కనిపిస్తుంటే కల అని ఎందుకనుకుంటా? మీ తాతయ్యకే అన్నీ అనుమానాలు. అందుకే ఇన్నేళ్లుగా నీ దగ్గరికి రావాలని అనుకున్నా... మనోల్లు చెప్పలేదు కదా అని, ఎవరికన్నా ఇబ్బందయితదేమో అని ఆపిండు...'' అన్నది.

''అయితే ఏం నేనే వచ్చాను కదా నానమ్మా,'' అన్నది అపురూప.

అంతసేపు ఆ ముగ్గురివైపే అటూ ఇటూ మార్చి చూస్తుండిపోయిన ఆ ముసలాళ్ల దగ్గరికి అపురూప వెళ్లి, ''తాతయ్యా, నానమ్మా... వీళ్లు ఎవరో తెలుసా? మా అమ్మమ్మ శాంతమ్మ, తాతయ్య రమణయ్య...'' అని ముసలామె కుర్చీ స్టాండ్ మీద ఒరిగి చెదరిపోయిన ఆమె జుట్టు సవరించింది.

నిజమా... అని ఆ ఇద్దరు లేచి వాళ్ల దగ్గరికి వెళ్లి చేతులు పట్టుకున్నారు. ''ఇంతసేపు మాదే సరిపోయింది... పలకరించనేలేదు...'' సంజాయిషీగా అన్నది దుర్గమ్మ కళ్లు తుడుచుకుంటూ,

వాళ్లు ఏమీ అనకముందే, ''పిల్ల నా దగ్గర పెరగలేదనుకున్నా కాని పోన్లెండి అమ్మమ్మ దగ్గరే ఉంది. ఎవరికిచ్చి ఎట్ల చూసుకుంటున్నరో అనే దిగులు ఉండేది. ఈయన అవేం పట్టించుకోలేగాని...' అని మొగుడి మీద నిష్టూరాలు పోయింది దుర్గమ్మ.

అపురూప కలగజేసుకుంటూ, ''నానమ్మా... నీవన్నది కొంచమే కరెక్టు, అమ్మమ్మ, తాతయ్య మా అమ్మవాళ్ల పేరెంట్స్ కాదు. అమ్మ చిన్నప్పుడే వాళ్లు పోయారట. నన్ను పెంచిన నిజం అమ్మమ్మ, తాతయ్య వీళ్లే, అమ్మ ఏదైనా పనిబడి లోపల్నించి వస్తే వీళ్ల దగ్గరే ఉండేదట. అమ్మను కూతుర్లాగ చూసుకునేవాళ్లట. నీకో సంగతి చెప్పేదా... నేను చిన్నగ ఉన్నప్పుడు ఒకసారి ఒంట్లో బాగాలేక అమ్మ మా దగ్గరికి వచ్చింది. నేను చిన్నపిల్లనని, నాకు అమ్మ అని చెప్పొద్దనుకున్నరంట. అమ్మను అమ్మమ్మ ఎంత ప్రేమగా చూసుకునేదంటే ఈ ఆంటీ వచ్చాక అమ్మమ్మ నన్ను పట్టించుకోవడమే మానేసిందని నాకు కోపం వచ్చేది...'' అని నవ్వేసింది.

''ఈ పిల్ల ఏమనేదో తెలుసా... అమ్మమ్మా ఈ ఆంటీ ఎప్పుడు పోతుంది? అని అడిగేది...'' అని శాంతమ్మ నవ్వుతూ అన్నది. ఆమె గొంతు తొలిసారి వినడమే. చాలా మెత్తగా అనిపించింది నారాయణకు.

''సుధాకర్, రజిత ఎప్పుడన్నా వస్తే చుట్టుపక్కల వాళ్లకు మా తమ్ముడి కొడుకు కోడలు అని చెప్పేవాళ్లం,'' అన్నాడు రమణయ్య.

కొడుకు పేరు వినగానే దుర్గమ్మకు మళ్లీ దుఃఖం వచ్చింది.

''మనం చూసుకోవాలేగాని అందరికి అందరం అమ్మానాన్నలం, కన్నబిడ్డలం కాలేమా? అనేవాడమ్మా బిడ్డ,'' అన్నది దుర్గమ్మ. ఒక నిమిషమయ్యాక, ''మీదే

అదృష్టం, వాళ్లను కొడుకు కోడలుగా చూసుకున్నరు, మనమరాల్ని పెంచుకున్నరు. నాకు ఆ భాగ్యం లేదనేగాని ఏ లోపం రాకుండ పెంచుకున్నరు...'' అని కూడా అన్నది.

''నానమ్మా.. ఈ తాతయ్య వాళ్లకు సంధ్య అని ఒక కూతురు ఉండేదంట. పార్టీలోకి పోయి చనిపోయింది. మా అమ్మనే అమ్మమ్మ కూతుర్లాగ చూసుకునేదట. అమ్మ కూడా అట్ల కావడంతో అమ్మమ్మకు, తాతయ్యకు దెబ్బ మీద దెబ్బ పడ్డట్ట యింది...'' అన్నది అపురూప.

ముసలామె చిన్నగా వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పుడు ఆమె పండు ముఖమంతా కందిపోయింది. కొంచెం ఆయాసపడింది.

''ఊకో ఊకో... మళ్లీ నీకు ఆయాసమొస్తే ఆస్పత్రికి పోవాలి...'' అన్నాడు రమణయ్య.

ఆ మాటకు నారాయణ, దుర్గమ్మ హతాశులయ్యారు.

''మీది మాది ఒకే బాధ, ఒకటే దుఃఖం. బిడ్డలు పొయినా మనం మొండిగా బతుకుతున్నం...'' అన్నాడు నారాయణ. దానికి ఆ ముసలాయన కదిలిపోయాడు.

''మా అమ్మమ్మకు ఎనభైఏళ్లు. మొన్ననే మా ఫ్రెండ్స్ అందర్నీ పిల్చి బర్త్ డే చేసినా. కొంచెం ఆయాసం అంతే. తాతయ్యకే బీపీ, సుగర్, కీళ్లనొప్పులు ఉన్నయ్ గాని అమ్మమ్మ ఇప్పుడు కూడా నా బండి మీద రయ్‌మని ఊరంతా నాతోపాటు షికార్ కొట్టేస్తుంది తెలుసా?'' అని నవ్వించింది.

ముసలామె కళ్లు తుడుచుకుంటూ, ''పోవే... నీ మాటలు, పడేస్తావే అన్నా వినకుండా నువ్వేగా తీసికెళ్లేది...'' అన్నది మురిపంగా సిగ్గుపడుతూ.

''చూడు... చూడు నేను పడేస్తాననేగాని, ఎక్కడ పడిపోతానో అనే భయం లేదు. దటీజ్ అమ్మమ్మ...''

''బిడ్డపోయి రెక్కలుడిగి ఒంటరిగా ఉన్న మా చేతుల్లో నెత్తురుగుడ్డును పెట్టారు పెంచుకోమని, అదే మాకు తోడైంది ఇప్పుడు...'' అంది శాంతమ్మ,

''మా కడుపున పుట్టిన బిడ్డను ఎట్ల పెంచుకున్నమో అట్లనే చూసుకున్నం...'' అన్నాడు రమణయ్య.

''అమ్మమ్మా నీకేం ఆకలి కావడం లేదా?'' అని మాట మార్చబోయింది అపురూప,

''అయ్యో ఏమన్నా తిన్నరో లేదో, చాయి కూడా పోయలేదు...'' అని దుర్గమ్మ లేవబోయింది.

''నువ్వు కూచొని అమ్మమ్మతో అమ్మానాన్న గురించి మాట్లాడుతూ ఉండు. నేను చాయి పెడతా. ఆ తర్వాత వంట కూడా చేస్తా...'' అని లేచిపోతూ, ''తాతయ్యా నువ్వు కాసేపు అట్ల నడుం వాల్చరాదు. జర్నీ చేసినవు కదా...'' అని చేయి పట్టుకొని లేపింది. నారాయణ ఆసరా వెళ్లి లోపలి గదిలోకి తీసికెళ్లాడు.

‘‘మీరు మాట్లాడుకుంటూ ఉండండి...’’ అని వంటగదిలోకి వెళ్లింది అపురూప. ఆమెతో పాటు దుర్గమ్మ కూడా నడిచింది.

రాత్రి పదకొండైంది. ముగ్గురు మాట్లాడుకుంటూనే ఉన్నారు.

‘‘మీ నానమ్మ రోజూ ఇప్పటికల్లా పడుకునేది, నువ్వు వచ్చినవు కదా ఇంక నిద్రపట్టడం లేదు,’’ అన్నాడు నారాయణ,

‘‘నా మనవరాలి కోసం ఎన్నేండ్లు ఎదురుచూసినా? ఇంకెట్ల నిద్రపడుతది చెప్పు,’’ అన్నది దుర్గమ్మ.

అపురూప చెప్పేవి వింటూ అప్పటికి ఆమె ఎన్నిసార్లు ఉద్వేగానికి గురైందో, బిడ్డా ఇంక మా దగ్గరే ఉంటావు కదా... అని ఎన్నిసార్లు అడిగిందో, దానికి అపురూప నేరుగా ఏమీ చెప్పలేదు.

‘‘తాతయ్యా... మా నాన్న అమ్మ ఆసరా లేక మీరు ఒంటరిగా ఇబ్బందిపడ్డారు. కళ్లముందే వాళ్లు చనిపోతే తట్టుకొని నిలబడ్డారు. అట్లనే తాతయ్య వాళ్లు కూడా బిడ్డను పోగొట్టుకున్నారు. అమ్మమ్మకు ప్రాణాలన్నీ నామీదే. నేనేదన్నా మీటింగుకు పోయి రెండు రోజులు రాకపోతేనే సరిగా అన్నం తినదు. మాకు అమ్మానాన్న అన్నా, సంధ్యా ఆంటీ అన్నా చాలా గౌరవం. అమ్మానాన్నలు చివరిసారి.. నాకు పదిహేనేళ్లను కుంటా... వచ్చారు. అప్పుడు నాన్న మాట్లాడుతూ... అపురూపను తెచ్చి మీ చేతిలో పెట్టినప్పుడు మీమీద భారం పెడుతున్నామనిపించింది. కానీ ఇప్పుడనిపిస్తోంది... అపురూప ఇప్పుడు మీ బాధ్యత చూసుకుంటుంది కదా అని. మీలాంటివాళ్లను చూసుకోడానికి ఎవరో ఒకరు ఉండాలి. అది అపురూపే ఎందుకు కాకూడదు?... అన్నాడు. ఆ మాటలు నాన్న వాళ్లతోనే అన్నాడు కాని నాకు చెప్తున్నట్లే అనిపించింది. అమ్మానాన్న చనిపోయినప్పుడు నేను వచ్చి దూరంగా ఉండి చూసి వెళ్లానేగాని మిమ్మల్ని కూడా పలకరించలేదు. కొడుకును కోడల్ని పోగొట్టుకున్న మీకు నేనున్నానని ఒక్క మాట కూడా అనలేకపోయానని ఎంత తల్లడిల్లిపోయానో. అప్పుడు నేను జాగ్రత్తగా చేయాల్సిన వేరే పనిలో ఉన్నాను. ఇప్పుడు ఒక నిర్ణయంతోనే మీ దగ్గరికి వచ్చాను. తాతయ్యా... నేను ఇక్కడే ఉంటాను...’’

అపురూప మాటలు ఇంకా పూర్తి కాకముందే దుర్గమ్మ సంభ్రమానికి లోనైంది. ఆనందంతో మనమరాలి చేతులు ముట్టుకుంది. ఆ ఒక్క మాట మనమరాలు అంటుందో లేదో అనే దిగులు మధ్యాన్నం నుంచి వెంటాడుతోంది. ఈ ఆనందమైనా దక్కుతుందా లేదా? అనే సందేహంలో ఉండింది.

ఆమె స్పందనకు అపురూప కదిలిపోయింది. కళ్లు తడి అయ్యాయి. ‘‘నానమ్మా... మిమ్మల్ని వదిలి నేను ఇంక ఎక్కడికీ వెళ్లను. అయితే మీ మీద నమ్మకంతో వాళ్లను కూడా తీసుకొని వచ్చాను. నిజానికి మీకే ఎవరన్నా వండిపెట్టి

అండగా ఉండాలి. కానీ మీకంటే అమ్మమ్మ, తాతయ్య చాలా పెద్దవాళ్లు. జబ్బులతో బాధపడుతున్నారు... ఈ ఇల్లు నా కోసమే కట్టించానని అన్నావు కదా. నా సొంతానికి అవేమీ ఒద్దుగాని, ఈ ఇంట్లో వాళ్లకు ఓ గది...' అపురూప మాటలు పూర్తికాకముందే... నారాయణ ఆమె చేతులు పట్టుకున్నాడు.

"అట్ల అనొద్దు తల్లీ. మా మీద నమ్మకం అన్నవు. అది ఉంచు. మేము కూడా దాన్ని కాపాడుకోవాలి కదా. నీ కోసం ఆరాటపడినమేగాని మేము నీకు ఏమీ చేయ లేదు. వాళ్లు నిన్ను కండ్లలో పెట్టుకొని పెంచుకున్నారు. మాలాగే బిడ్డను పోగొట్టుకున్నరు. నీకోసం కాదు... వాళ్ల కోసమే... వాళ్లను చూసుకుంటం..." అన్నాడు.

"తాతయ్యా... మామూలుగా కన్నవాళ్లను బిడ్డలు చూసుకోవాలి. కానీ మీలాంటి వాళ్లు ఉద్యమానికి పిల్లల్ని యిచ్చి ఈ వయసులో మీరు పిల్లలుగా మారి పోతారు. మీకు తప్పక తోడు కావాలి. ఇప్పుడు కొత్త సంప్రదాయాలు రావాలి. మనుషుల్ని కలపడమే మన పని. ఒకరికి ఒకర్ని ఆసరాగా నిలబెట్టడమే ఇక మనం చేయాల్సింది. మీలాంటి తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు మనవాళ్లు ఎందరో ఉన్నారు. అత్యంత సహజమైన వృద్ధాప్యం బైట సమస్యగా మారిపోయిందిగాని, మనకు అది సమస్య కాకూడదు కదా, ఇలాంటి వాళ్లు ఒకరికి అండగా నిలబడి ఆసరా పొందాలేమో.. దీనికి మనం - ఏమైనా చేయలేమా? తాతయ్యా..."

తను అలా చెప్పుకపోతోంటే ఆయనలో ఆలోచనలేవో...

*అరుణతార మాసపత్రిక*
*జనవరి 2018*

*

**పద్మకుమారి** విప్లవ రచయితల సంఘం సభ్యురాలు. ప్రజా ఉద్యమ కార్యకర్త. అమరుల బంధుమిత్రుల కమిటీకి బాధ్యులు. దాదాపు పదిహేను కథలు రాశారు. ఫల్గుణ నవల ప్రచురించారు.

తను పనిచేస్తున్న సంస్థ నిబంధనలను దృష్టిలో ఉంచుకొని రచయిత అనుమతి తీసుకోకుండానే ఈ కథను ప్రచురిస్తున్నాం. ఇలా రచయిత అనుమతి లేకుండా కథాసాహితి సంకలనాలలో కథను ప్రచురించడం ఇదే మొదటిసారి. వస్తు విస్తృతి, వైవిధ్యతల రీత్యా ఈ కథను ప్రచురించడం అవసరంగా భావించాం.